క్లుప్తంగా

ప్రజలు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు



వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులోని వలంటీర్లకు శుక్రవారం కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సన్మానం చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని ఆమాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. వలంటీర్లు మరింత చిత్తశుద్ధితో పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎంలు

ఎంవీపీ కాలనీ: రుతు పవనాలు ప్రవేశించి వర్షాలు అధికమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జీవీఎంసీ ఆరోగ్యశాఖ విభాగం సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారానికి ఆరోగ్య శాఖ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జోన్-3 పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఎంవీపీ కాలనీ పరిధిలోని జాలరిపేటపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్టు స్థానిక సూపర్‌వైజర్లు తెలిపారు. ఇప్పటికే 19వ వార్డులో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం చేశామన్నారు. శుక్రవారం పలు చోట్ల ఏఎన్‌ఎంలు సర్వేలు నిర్వహించారన్నారు. వార్డుల వారీగా ప్రతిరోజు ఈ సర్వే కొనసాగుతుందని వెల్లడించారు.

వడకట్టిన నీరు సరఫరా చేయాలి



12వ వార్డు సచివాలయంలో సిబ్బందిని నీటి సమస్యపై నిలదీస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరిననగర్‌లో కొద్ది రోజులుగా కుళాయిలు ద్వారా బురద, మలినాలతో కూడిన నీరు సరఫరా జరుగుతుందని సీపీఎం నాయకులు శుక్రవారం సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. కాలనీలో వడకట్టిన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ముడసర్లోవ రిజర్వాయరులో నీటిని సరిగా వడకట్టి సరఫరా చేయాలని కోరుతూ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు కుమార్, సూర్యమణి, కాంతం, సత్యవతి, అరుణ, దేవుడమ్మ, రత్నం పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్)లో అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. పదో తరగతి చదవిన విద్యార్థులకు మహారాణిపేటలోని నేక్ శిక్షణా కేంద్రంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 79895 72891, 83090 59974కు సంప్రదించాలని సూచించారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- 13వ వార్డులో పథకాలపై అవగాహన



పాండురంగాపురంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అక్కరమాని విజయనిర్మల ముఖ్యఅతిథిగా హాజరై పాండురంగాపురంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. వృద్ధులు, యువకులు, మహిళలతో ఆమె మాట్లాడి ఇప్పటి వరకు ఏయే సంక్షేమ పథకాలు అందాయో అడిగి తెలుసుకున్నారు. పథకాల కోసం అర్హులైనవారు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు కోసం రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించారన్నారు. ఆ నిధులతో అన్ని ప్రాంతల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బంది, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఆ క్యాంప్‌లో కుల, ఆదాయ, జనన, మరణ, ఆధార్, మ్యూటేషన్, వివాహ, రేషన్ కార్డు, ఫ్యామిలీ మెంబర్, తదితర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు.

సహనం, క్షమాగుణాలను ప్రోత్సహించాలి



విదేశీ విద్యార్థులతో డీన్ ధనుంజయరావు తదితరులు

ఏయూ క్యాంపస్: సహనం, క్షమాగుణాలను ప్రోత్సహించాలని ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. శుక్రవారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో గాంధీజీ ప్రపంచ శాంతి సదస్సులో ఆయన మాట్లాడారు. శాంతి, అహింసలకు నిర్వచనంగా గాంధీజీ జీవితం నిలుస్తుందన్నారు. వసుధైక కుటుంబం నినాదంతో పాటు ప్రపంచ శాంతిని కాంక్షించడం ఎంతో అవసరమన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ నేటి తరంలో గాంధీజీ ఆవశ్యకతను తెలియజేసే విధంగా కార్యక్రమాలను కేంద్రం నిర్వహిస్తోందన్నారు. నేపాల్‌లో గాంధీయన్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ లాల్ బహదూర్ రానా, భాషా శాస్త్రవేత్త డాక్టర్ చల్లా అభిషేక్, డాక్టర్ కిషోర్ కుమార్ ప్రసంగించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విదేశీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం తరఫున ఆచార్య ధనుంజయరావును సత్కరించారు.

పోలీసుల అదుపులో ఫేక్ ఐడీ తయారీ ముఠా

అల్లిపురం: వేర్వేరు కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులకు బెయిల్ ఇచ్చే వ్యక్తులకు ఫేక్ ఐడీలు, ఆధార్ కార్డులు సృష్టించి వేలకు వేలు దండుకుంటున్న ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణిపేట పరిధి తాడివీధిలో లక్ష్మి అనే మహిళ సహా నలుగురు వ్యక్తులు బెయిల్, పూచీకత్తుల కోసం ప్రయత్నించే వారే లక్ష్యంగా ఫేక్ ఐడీలు, డాక్యుమెంట్లు తయారు చేసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసుల బృందం ఒకటి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఇంకా ఎంత మంది ఉన్నదీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎస్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్, సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్, ట్రీఎస్ బిజినెస్ ఇన్ఫో సర్వీసెస్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఆటోమోటివ్, వరుణ్ మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 715 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 569 మంది అభ్యర్థులు హాజరైతే 428 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి, ఎ.సంగీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని సుబ్బిరెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి–మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా–పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి–హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్–అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలపైనే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళికా అధికారి సునీత

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన ‘టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం’లో వచ్చిన ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపైనే అందాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఓపెన్ ఫోరంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. జోన్-3 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఆరు, జోన్-6 నుంచి మూడు, జోన్-8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయి.

ఇలా ఫిర్యాదు చేయండి..

జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైన, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులు తెలపాలన్నా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తెలపవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరు 8187897569 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదులో పూర్తి వివరాలు.. పేరు, డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా.. సమస్యతో కూడిన సమాచారాన్ని వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించి, ఆ సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’కు సిద్ధం కావాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో జరగనున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు సిద్ధం కావాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ చాంబర్లో ఉన్నతాధికారులతో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ విశాఖ నగరంలో జరిపేందుకు తక్కువ రోజుల వ్యవధే ఉన్నందున అధికారులందరూ ఈ విషయమై అన్ని పారామీటర్స్‌తో పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. పౌరాభిప్రాయ సేకరణపై ప్రజలను అవగాహనపరిచేటట్టు చర్యలు చేపట్టాలని ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. ఎకో–వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులతో పెయింటింగ్ పోటీలు నిర్వహించి ఉత్తమంగా నిలిచిన పెయింటింగ్‌లను నగరంలో హోర్డింగ్‌ల ద్వారా ప్రదర్శించాలని ఆదేశించారు. 15 రోజుల పాటు విశాఖ సాగర తీరాన ఎకో–వైజాగ్‌పై స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి వినూత్న కార్యక్రమాలు జరపాలని అదనపు కమిషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించడం మన బాధ్యత

పీఎం పాలెం: భారతీయ సంప్రదాయ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళల ప్రదర్శన– విక్రయాల స్టాల్స్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చేతితో తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. స్టాల్స్ నిర్వాహక ప్రతినిధి మాట్లాడుతూ శిల్పారామంలో ఏర్పాటు చేసిన 60 స్టాల్స్‌లో దేశంలోని 20 రాష్ట్రాల్లో తయారైయిన హస్తకళల ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. కార్యకమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత,సత్యానారాయణ,శిల్పారామం ఏవో విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ మద్దిలపాలెం డిపో కార్యవర్గం ఎన్నిక



డిపో మేనేజర్ అరుణకుమారి కలిసిన నూతన కార్యవర్గం సభ్యులు

మద్దిలపాలెం : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ మద్దిలపాలెం డిపో నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో మద్దిలపాలెం డిపో అధ్యక్షుడిగా ఎం.ఇ.రావు, కార్యదర్శిగా పి.సిహెచ్.ఎస్.రావు, కోశాధికారిగా డి.సిహెచ్.బాబు ఎన్నికయ్యారని అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్ తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు డిపో మేనేజర్ అరుణకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, డివిజనల్ కార్యదర్శి కె.శివాజీ, అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కె.ఎస్.మూర్తి, సిహెచ్.ఇ.రావు పాల్గొన్నారు.

జూలైలో హెల్త్ బేబీ కాంటెస్ట్

బీచ్ రోడ్డు: హెల్తీ బేబీ కాంటెస్ట్ పేరుతో జూలై నెలలో పోటీలు నిర్వహించనున్నట్టు వీరుమామ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రవేశం పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతి చిన్నారికి ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. విజేతలకు బహుమతులతో పాటు టైటిల్స్ అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 72073 40513 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

30 వరకు సంపర్క్ అభియాన్‌పై సమీక్షలు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంపర్క్ అభియాన్ కార్యక్రమంపై సమీక్షలు తీసుకోనున్నట్లు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రివ్యూ కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి ఘటనలో వ్యక్తికి గాయాలు

ఎంవీపీ కాలనీ: ప్రియురాలి విషయంపై జాలరిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాలరిపేటకు చెందిన మజ్జి జశ్వంత్, ఎం.రాము స్నేహితులు. ఇద్దరికీ చోరీల నేపథ్యం ఉండగా.. జశ్వంత్‌పై సస్పెక్టెడ్ షీట్ కూడా ఉంది. అయితే గురువారం రాత్రి ఇద్దరూ మద్యం సేవించిన అనంతరం జశ్వంత్ ప్రియురాలి విషయంలో గొడవ జరిగింది. ప్రియురాలు తనతో తిరుగుతున్న విషయం రాము కారణంగానే వారి ఇంట్లో తెలిసిందని జశ్వంత్ గొడవకు దిగాడు. తన వద్ద ఉన్న కత్తితో మద్యం మత్తులో రాముపై దాడి చేశాడు. దీంతో రాము భుజం, కంఠంపై తీవ్ర గాయాలయ్యాయి. అనంతం స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, రాముని ఆస్పత్రికి తరలించారు. జశ్వంత్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షకు మండల స్పెషల్ ఆఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల(ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎస్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్ఆర్‌సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషినల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

సైనికోద్యోగుల శిక్షణ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న ఆచార్య భాస్కరరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌లో మెరైన్ ఎలక్ట్రికల్–నేవిగేషన్ సిస్టమ్స్, మెరైన్ ఇంజినీరింగ్–నేవల్ ఆర్కిటెక్చర్ డిప్లమా కోర్సుల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను ఏయూ కంప్యూటర్ సెంటర్ సంచాలకుడు ఆచార్య సి.హెచ్.వి.వి.ఎస్.భాస్కరరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సైనికోద్యోగులు పదవీ విరమణ తరువాత కొత్త ఉపాధి అవకాశాలను సాధించడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. మూడు నెలల కాలంలో రక్షణ రంగాలకు చెందిన 75 మంది ఉద్యోగులు ఏయూలో శిక్షణ పొందనున్నారు. ఇప్పటికే కేంద్రం నుంచి 39 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీఎస్ కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.నిరంజన్, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల్‌కుమార్‌ఘటక్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో శుక్రవారం బలిదాన నివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయవాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 70వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ జాతీయవాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరిలోవ టీఐసీ పాయింట్ నుంచి బాలాజీనగర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆరిలోవ మండలం అధ్యక్షుడు మధుపాడ సన్యాసిరావు, నాయకులు సుబ్బలక్ష్మి, సుబ్బలక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ గ్రాండ్ ఫినాలే నేడు

సీతంపేట: నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫినాలే పోటీలు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి గురజాడ కళాక్షేత్రంలో జరుగుతాయని నిర్వాహకుడు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ రంజన్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్, రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ పోటీలకు ఇండియన్ హిప్‌హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్, బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.1 లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన మిల్లెట్ స్నాక్స్ అందుబాటులోకి తెచ్చిన గంధం ఫుడ్స్ నాపల్లి ఈ ఈవెంట్‌కు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంజన్‌నాయక్ కోరారు.

ప్రతిభావంతులకు సత్కారం



మోదప్రియాంక, ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న డీసీవో రూపావతి

మధురవాడ: విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిస్తే అన్ని చోట్లా గౌరవం దక్కుతుందని విశాఖ, అనకాపల్లి జిల్లా గురుకులాల సమన్వకర్త ఎస్.రూపావతి చెప్పారు. కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో శుక్రవారం 10వతరగతిలో 588 మార్కులు సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాలు పురస్కారం అందుకున్న పాఠశాలకు చెందిన ఎస్. మోదప్రియాంక, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచిన వై. జస్సికా, ఇవాంజలిను అభినందించారు. అనంతరం జగనన్న విద్యా దీవెన కిట్స్ విద్యార్థినులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. నాగమణి, 7వ వార్డు వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ పలివెల రవికుమార్, రిక్షా కాలనీ అధ్యక్షుడు జోగారావు, సచివాలయ కన్వీనర్ కొండమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాద్ పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కోర్టు రెండు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు పోలీసులు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఇదే క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. దీంతో విశాఖ రెండో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందుబాబులకు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. గత ఏడాదిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు రెగ్యులర్‌గా కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీంతో వారు 2 నుంచి 5 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాపాయమని, వాహనాలు నడుపుతున్నపుడు మద్యం మత్తుకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

మద్దిలపాలెం: పీఎంకేవీవై 4.0 పథకం కింద టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన 30 మంది మహిళలకు 105 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తి ఉండి, పదో తరగతి ఉత్తీర్ణతులైన 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సుగల మహిళలు అర్హులన్నారు. దరఖాస్తును ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పదో తరగతి మార్కుల జాబితా జత చేసి ఈ నెల 26వ తేదీలోగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8500054456 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.